సాక్షి
చిత్తూరు
బుధవారం ¦ 11 ¦ జనవరి ¦ 2023



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,060

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.69,000
రిటైల్ వెండి గ్రాము	రూ.71

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	30	15
తిరుపతి	29	16
తిరుమల	26	12
గూడూరు	31	18
నగరి	31	17



సంకటహర చతుర్థిని పురస్కరించుకుని కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారు సిద్ధి, బుద్ధి సమేతంగా మంగళవారం రాత్రి మాడ వీధుల్లో ఊరేగారు. పెద్దసంఖ్యలో భక్తులు దేవదేవేరులను దర్శించుకున్నారు. -కాణిపాకం

న్యూస్‌రీల్

14న మకరజ్యోతి దర్శనం



సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోట మల్లై అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 14వ తేదీన మకరజ్యోతి దర్శనం ఉంటుందని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఆన వాయితీ ప్రకారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబసమేతంగా తిరు ఆభర ణాలను స్వామివారికి సమర్పించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయానికి తూర్పు దిక్కులోని కొండపై నుంచి మకరజ్యోతి దర్శన మిస్తుందని వివరించారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మాక్ టెస్టు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వార్షిక ఆదాయ అవసరాలు, బిల్లుల పెంపుపై మంగళవారం ట్రాన్స్‌కో రూరల్ ఈఈ కార్యాలయంలో మాక్ టెస్టు నిర్వహించారు. ఈనెల 19 నుంచి 21 వరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. ఈమేరకు జిల్లాలోని అన్ని ఈఈ కార్యాలయాల్లో తిరుపతి డిస్కం కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ మాక్‌టెస్టును నిర్వహించారు. సాంకేతికంగా సమస్యలుంటే తెలుసుకుని అందుకు తగ్గ జాగ్రత్తలు తీసుకోనున్నారు. కార్యక్రమానికి సంబంధించి రద్దీ ప్రదేశాల్లో ప్రచార బ్యానర్లు పెట్టి అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి ఆదేశించారు.

షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

రామకుప్పం: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం షూటింగ్ బాల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ మురళీకృష్ణ తెలిపారు. విజయవాడలో ఈ నెల 14వ తేదీన నిర్వహించే స్పోర్ట్స్' అథారిటీ ఆఫ్ షూటింగ్ బాల్ లీగ్ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో చీఫ్ కోచ్ బాలాజీ, షూటింగ్‌బాల్ జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు, సెలక్షన్ కమిటీ పీడీ వెంకటరమణారెడ్డి, మురళి, జాబీర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలలకు గురువారం నుంచి సంక్రాంతి సెలవులు ప్రకటించినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 12 నుంచి 18 వ తేదీ వరకు సెలవులు ఉంటాయన్నారు. ఈ సమయంలో తరగతులు నిర్వహించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెన్షనర్లకు లైఫ్ సర్టిఫికెట్ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : పెన్షనర్లు ఫిబ్రవరి 28 వ తేదీలోపు తప్పనిసరిగా లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలని జిల్లా ట్రెజరీ శాఖ డీడీ రామచంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు జీవన్ ప్రమాణ్ పోర్టల్ ద్వారా సబ్ ట్రెజరీ అధికారికి లైఫ్ సర్టిఫికెట్ అందించవచ్చన్నారు.

కోడి పందెం.. జల్లికట్టుపై నిషేధం



ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు, జల్లికట్టును నిషేధిస్తున్నామని ఎస్పీ రిశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ అధికారులతో మాట్లాడారు. గ్రామపెద్దలతో సమావేశాలు నిర్వహించి, నిబంధనలను వివరించాలని ఆదేశించారు. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని, నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

అటవీ అధికారి సస్పెన్షన్

చిత్తూరు కార్పొరేషన్ : బంగారుపాళ్యం మండలం మొగిలి వెంకటగిరి ఫారెస్టు బీట్ అధికారి (ఎఫ్‌బీఓ) కె.పవన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ డీఎఫ్‌ఓ చైతన్యకుమార్‌రెడ్డి ఆదేశాలు జారీచేసినట్లు ఎఫ్‌ఆర్‌ఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరు 15వ తేదీన వన సంరక్షణ సమితి ఖాతా నుంచి మొక్కల పెంపకం కోసం ఎఫ్‌బీఓ పవన్‌కుమార్ రూ.23,433 విత్‌డ్రా చేశాడన్నారు. అయితే ఆ నగదుతో మొక్కలు నాటలేదని తెలియడంతో సంజాయిషీ అడిగినా సమాధానం రాలేదని వెల్లడించారు. డీఎఫ్‌ఓ స్పందించి పవన్‌కుమారేను సస్పెండ్ చేశారని వివరించారు.

ఆధ్యాత్మికం.. ధనుర్మాసం



రంగవల్లులతో తీర్చిదిద్దిన వీధులు.. గుమ్మడి పూల అలంకరణతో కొలువుదీరిన గొబ్బెమ్మలు..
ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతూ హరిదాసు కీర్తనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు..
పిండివంటల ఘుమఘుమలు.. నూతన వస్త్రాలు ధరించిన పిల్లల కేరింతలు..
ఊరంతా బంధుమిత్రుల సందళ్లు.. తొలి పండుగకు వచ్చిన కొత్త అల్లుళ్లు..
ఇంటికి చేరిన ధాన్యరాశులు.. అన్నదాతల ఆనందోత్సాహాలు ..
పల్లె ముంగిట గిలిగింతలు పెట్టే చలి మంటలు..
ఆలయాల్లో పులకింపజేసే తిరుప్పావై ప్రవచనాలు..
దేవదేవులకు విశేష అభిషేకాలు..
ధనుర్మాస ప్రత్యేకతకు నిదర్శనాలు.

- శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరం
- భోగి, సంక్రాంతి, కనుమల సమాహారం
- సంస్కృతి..సంప్రదాయాలకు ఆలవాలం
- పల్లెసీమలు మరింత శోభాయమానం



గంగవరం : ధనుర్మాసంతో పండుగ నెల ప్రారంభమవుతుంది. పట్టణ ప్రాంతాల్లోని వారికి ఈ మాసం విశిష్టతపై అంతగా అవగాహన లేకపోయినా.. పల్లెసీమలు మాత్రం పరవశిస్తుంటాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట ఇంటికి చేరే మాసంగా అన్నదాతలు భావిస్తారు. నెల మొదలైనప్పటి నుంచే పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మొదలవుతాయి. సూర్యోదయం నుంచే హరిదాసు కీర్తనలు మనసును రంజింపజేస్తాయి. పల్లెపడుచులు ఆలపించే గొబ్బి పాటలు ఉత్సాహాన్నిస్తాయి.

గొబ్బెమ్మ కొలువులు

పండుగ నెల ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి ఇంటి ముందు ఉదయాన్నే కళ్లాపు చల్లి అందమైన ముగ్గులు వేసి వాటి మధ్యన గొబ్బెమ్మను పెట్టి పూజిస్తారు. తెలుగు సాంప్రదాయం ప్రకారం గొబ్బెమ్మలను గోదాదేవి, లక్ష్మీదేవి, గౌరీ మాతగా భావిస్తారు. గోవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ముగ్గుల మధ్యలో ఉంచి గుమ్మడి, తంగేడు , గురుగు పూలు, పసుపు కుంకుమ సమర్పించి పూజిస్తారు. ధనుర్మాసం పొడవునా గొబ్బెమ్మను పూజించడం ఆనవాయితీ.

భోగిభాగ్యాలు

భోగి పండుగ నాడు ప్రతి ఇంటి ముందు భోగి మంట వేస్తారు. దీంతో సకల దోషాలకు పరిహారం లభిస్తుందని భావిస్తారు. పల్లెల్లో చిట్లాకుతో వేసే మంట ద్వారా వచ్చే పొగ పీల్చడం ఆరోగ్యానికి మంచిదని నమ్ముతారు. వేకువనే చిన్నాపెద్దా కలిసి భోగి మంట వేసుకుని చలి కాచుకుంటూ పరమానందం పొందుతారు.

కనుమతో ధనుర్మాసం పూర్తి

కనుమ పండుగతో ధనుర్మాసం ముగుస్తుంది. దీన్నే పశువుల పండుగ అని కూడా అంటారు. ఏడాది పొడవునా వ్యవసాయ పనుల్లో సాయం చేసిన పశువులకు రైతులు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. ఆవు పేడతో దొడ్డిని ఏర్పాటు చేసి తంగేడు, నల్లేరుతో అలంకరిస్తారు. అనంతరం వివిధ రంగులతో సుందరంగా తీర్చిదిద్దిన పశువులతో దొడ్డిని తొక్కించి పరుగులు తీయిస్తారు. ఈ విధంగా ధనుర్మాసం విశిష్ట పండుగల సమాహారంగా తెలుగు లోగిళ్లలో మరచిపోలేని అనుభవాలను మిగులుస్తుంది.

సంక్రాంతి.. పితృదేవతలకు శాంతి

మకర సంక్రాంతి ని పెద్దల పండుగ అని కూడా అంటారు. ఈ రోజున పితృ దేవతలకు కొత్త బట్టలు పెట్టుకుని తర్పణాలు వదులుతారు. పంచభక్ష్య పరమాన్నాలతో కూడిన నైవేద్యం సమర్పించి పెద్దల ఆశీర్వచనం పొందుతారు. పేదలకు అన్నదానం చేసిన అనంతరం ఇంటిల్లపాది కలిసి భోజనం చేసి ఆనందిస్తారు.

శ్రీమహావిష్ణువుకు ప్రీతిపాత్రం

ధనుర్మాసం శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైన మాసం. ఈ సందర్భంగా వేకువనే స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా తిరుమల శ్రీవారి సన్నిధిలో ధనుర్మాసంలో సుప్రభాత సేవ స్థానంలో తిరుప్పావై నిర్వహిస్తారు.





నామినల్ రోల్స్‌కు ఎడిట్ ఆప్షన్

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌లో తప్పులు సరిదిద్దేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారని డీఈఓ విజయేంద్రరావు, జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గురుస్వామిరెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీలోపు జిల్లాలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎడిట్ ఆప్షన్ వినియోగించుకోవాలన్నారు. విద్యార్థుల వివరాల్లో తప్పులుంటే సరిదిద్దాలని చెప్పారు. గడువు ముగిస్తే ఇక అవకాశం ఉండదన్నారు. జిల్లాలో ఈనెల 9తో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు ముగిసిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 44 స్టడీ సెంటర్లలో పదో తరగతికి 1,057 మంది, ఇంటర్‌కు 3,205 మంది దరఖాస్తు చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు.

శ్మశాన స్థలాల భూసేకరణ వేగవంతం



మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో శ్మశాన స్థలాలకు భూసేకరణ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓ, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో శ్మశానాల ఏర్పాటుకు భూ కేటాయింపులు చేపట్టిందని, 22ఏలో ఉన్న భూములకు సంబంధించిన నివేదికలను వెంటనే తయారు చేయాలని ఆదేశించారు. రీ సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. అసైన్‌మెంట్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. మొదటి దశ రీ సర్వే కార్యక్రమంలో భూ హక్కు పత్రాలు సంక్రాంతి లోపు పంపిణీ చేయాలన్నారు. ఇప్పటి వరకు 766 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయిందని వెల్లడించారు. డీఆర్‌ఓ రాజశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

డీఈగా వసంతనాయుడు

చిత్తూరు కార్పొరేషన్: విజయవాడ ట్రాన్స్‌కో లోడ్ సరఫరా డీఈ వసంతనాయుడును తిరుపతి డిస్కం కార్యాలయ లోడ్ మేనేజ్‌మెంట్ సెంటర్ డీఈగా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇక్కడి డీఈ మహేశ్వర్‌రెడ్డి ఇటీవలే ట్రాన్స్‌ఫార్మర్ డీఈగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

ఫిర్యాదుల స్వీకరణకు ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్

– టోల్‌ఫ్రీ నంబర్ 1967

చిత్తూరు కలెక్టరేట్: ఫిర్యాదుల స్వీకరణకు ఇంటిగ్రేటెడ్ కాల్‌సెంటర్‌ను ప్రారంభించినట్లు జేసీ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల సంస్థ ద్వారా పంపిణీ చేసే నిత్యావసర వస్తువుల ప్రజాపంపిణీ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతోందని, ఇందులో భాగంగా పది మంది ఎగ్జిక్యూటీవ్‌లతో కూడిన ఇంటిగ్రేటెడ్‌కాల్ సెంటర్‌ను ప్రారంభించినట్లు వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్‌కాల్ సెంటర్ ఈ నెల 10వ తేదీ నుంచి పనిచేస్తోందని తెలిపారు. సమస్యలను అర్థం చేసుకోవడానికి, సంబంధిత అధికారులకు పంపడానికి, ఫిర్యాదు చేసిన వ్యక్తికి తగు సమాచారం ఇవ్వడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌లో ప్రజా పంపిణీ వ్యవస్థ/ ధాన్యము కొనుగోలు/ లీగల్ మెట్రాలజీ/ వినియోగదారుని రక్షణకు సంబంధించిన ఏదైనా సమస్యను స్వీకరించి పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1967కు కాల్‌చేసి సమస్యలు తెలియజేయవచ్చని జేసీ తెలిపారు.

కాణిపాకం కిటకిట



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిట లాడింది. స్వామివారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడే ఆరోవిడత 'తోడు'

- 31,649 మంది లబ్ధిదారులకు రూ.84,80,447 సాయం
- వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, చిత్తూరు : చిరువ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. జగనన్న తోడు పథకం కింద వడ్డీలేని రుణాలను మంజూరు చేస్తోంది. అందులో భాగంగా బుధవారం తాడేపల్లె నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఆరోవిడత జగనన్న తోడును ప్రారంభించనున్నారు. ఒక్కో లబ్ధిదారుడి ఖాతాలో రూ.10వేలు జమ చేయనున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన చిరు వ్యాపారులు 21,866 మందికి రూ.59,897,00, పట్టణ ప్రాంతాల్లోని 9,783 మంది లబ్ధిదారులకు రూ.24,90,721 అందించనున్నారు. ఈ పథకం కింద సంప్రదాయ కళాకారులతోపాటు చిరు వ్యాపారులు, ఫుట్‌పాత్‌లపై విక్రయాలు చేసేవారు, తోపుడు బండ్లపై కూరగాయలు అమ్మేవారు, సంప్రదాయ వృత్తుల్లోని వారికి లబ్ధి చేకూర్చనున్నారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని చిత్తూరులోని జిల్లా సచివాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని వెల్లడించారు.

పేదల అభ్యున్నతికే ప్రాధాన్యం

- సుపరిపాలనకే సచివాలయాలు
- ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నడిగడ్డలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

సదుం : పేదల అభ్యున్నతికే తొలి ప్రాధాన్యమిస్తున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని బూరగమంద, మొరవపల్లె, జోగివారిపల్లె, చెరుకువారిపల్లె, నడిగడ్డ పంచాయతీల్లో నిర్వహించిన పల్లెబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, అంగన్‌వాడీ, ఆర్‌బీకే భవనాలను ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సుదీర్ఘ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కార్యాచరణ అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు సుపరిపాలన అందించాలనే ధ్యేయంతోనే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి ముంగిటకే చేరుస్తున్నారని వెల్లడించారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అవసరమైన సాంకేతిక సాయంతోపాటు, ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తున్నారని వివరించారు. గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తల్లీబిడ్డల సంరక్షణలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామీణ ప్రాంతాల ముఖచిత్రమే మారిపోతున్నట్లు వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

సదుం మండలంలోని మొరవమీదపల్లె, దిన్నెవడ్డిపల్లె, గాదేవారిపల్లెకు చెందిన 29 మంది టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై పెద్దసంఖ్యలో టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీ సీఈఓ ప్రభాకరరెడ్డి, డీపీఓ లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, వైఎస్సార్‌సీపీ నేత వల్లివేడు పృథ్వీరెడ్డి పాల్గొన్నారు.

'డైట్'లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో చాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు

కార్వేటినగరం: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో మంగళవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చాత్రోపాధ్యాయులు డైట్ ఆవరణంలో రంగవల్లులను తీర్చిదిద్దారు. సంప్రదాయ వంటకాలను తయారు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. గొబిళ్లు, కోలాటాలు, కర్రసాము, నాలుగు స్తంభాలాట, బొంగరాలు, వైకుంఠపాళి తదితర ఆటలతో ఆకట్టుకున్నారు. భోగి మంట వేసి, గోపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీరామ్ పురుషోత్తం, ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు, అధ్యాపకులు ప్రభాకర్, నిర్మల, దేవప్రసాద్, మహమ్మద్‌రఫీ, శ్రీనివాసులురెడ్డి, నగరాజు నాయక్, రెడ్డి వెంకటరమణ, అనిత, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.





భోగి మంట వేస్తున్న అధ్యాపకులు, చాత్రోపాధ్యాయులు (ఇన్‌సెట్) వైకుంఠ పాళి ఆడుతున్న చాత్రోపాధ్యాయులు

క్లుప్తంగా

బెల్టు షాపులపై పోలీసుల దాడి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చిన్న యగుంట, తహనగర్ గ్రామాల్లో బెల్టు షాపులపై దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారంతో దాడి చేసినట్టు పేర్కొన్నారు. నిందితుల నుంచి 13 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



గంగవరం: పలమనేరు రూరల్ మండలం, కొలమాసనపల్లి గ్రామానికి పక్కనున్న డాబా సమీపంలో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం లభ్యమైంది. మృతుడు గీతల షర్టు, పెద్ద డ్రాయర్ ధరించి ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి దాదాపు 50 ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి




గణేష్ మృతదేహం

పుంగనూరు : పట్టణంలోని గోకుల్ సర్కిల్ వద్ద మంగళవారం బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. స్థానిక నాగపాళ్యెంలో నివసించే జంగాల గణేష్ (58) నడిచి వెళుతుండగా ద్విచక్రవాహన దారుడు వేగంగా వచ్చి ఢీకొన్నాడు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పక్కా ఇంటికి సాయం!

నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కార్యాచరణ అమలు చేస్తోంది. త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా సహకారం అందిస్తోంది. ఈక్రమంలో ఇప్పటికే అందించిన సాయం చాలని పక్షంలో పావలా వడ్డీకే అదనపు రుణం మంజూరు చేయిస్తోంది. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థికంగా వెసులుబాటు కల్పిస్తోంది. అందులోనూ ఉన్నతి పథకం వర్తించేవారికి సున్నా వడ్డీతో చేయూతనిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చి నాటికి లబ్ధిదారులతోగృహప్రవేశం చేయించాలనే దిశగా అడుగులు వేస్తోంది.

- జగనన్న ఇళ్లకు అదనపు రుణాలు
- రెండో విడతలో మరింత వెసులుబాటు
- రూ.35 వేల నుంచి రూ.లక్ష వరకు మంజూరు
- డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీ మాత్రమే
- 'ఉన్నతి' లబ్ధిదారులకు సున్నావడ్డీ



నగరి మండలం నాగరాజుకుప్పంలో శరవేగంగా సిద్ధమవుతున్న జగనన్న ఇళ్లు

చిత్తూరు అగ్రికల్చర్ : జిల్లాలో పక్కా ఇళ్ల నిర్మాణ పనులను ప్రభుత్వం మరింత వేగవంతం చేసింది. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం డీఆర్‌డీఏ, మెప్మా ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అదనపు రుణాలు మంజూరు చేయిస్తున్నారు. మార్చి నెలాఖరులోపు అన్ని ఇళ్లు పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నారు.

రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు..

పక్కా ఇల్లు నిర్మించుకుంటున్న వారికి ప్రభుత్వం ముందుగా రూ.1.80లక్షలు అందించింది. ఈ మొత్తం సరిపోని పక్షంలో మరింత సాయాన్ని రుణంగా మంజూరు చేస్తోంది. అందులో భాగంగా డ్వాక్రా మహిళలకు తొలుత రూ.35వేలను పావలా వడ్డీకే రుణంగా అందిస్తున్నారు. అదీ చాలకుంటే రెండో విడతగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే ఉన్నతి పథకం వర్తించే ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు సున్నావడ్డీకే రుణాలు అందిస్తున్నారు.

రూరల్ పరిధిలో రూ.147.32 కోట్లు

జిల్లావ్యాప్తంగా రూరల్ పరిధిలో మొత్తం 73,628 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. తొలుత ప్రభుత్వం అందించిన రూ.1.80లక్షల ఆర్థిక సాయం చాలకపోవడంతో స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన 36,487 మంది మహిళలు అదనపు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరికి డీఆర్‌డీఏ ద్వారా రూ.147.32 కోట్ల అదనపు మంజూరు చేశారు.

అర్బన్ పరిధిలో రూ.14.35 కోట్లు

అర్బన్ ప్రాంతాలైన చిత్తూరు , నగరి, పలమనేరు, పుంగనూరు పురపాలక పరిధిలో మొత్తం 16,560 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. వారిలో 7,921 మంది స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఉన్నారు. వీరిలో 6,215 మంది అదనపు రుణం కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పటి వరకు రూ. 14.35 కోట్లు అందించారు.

సకాలంలో పూర్తి చేయడమే లక్ష్యం



జగనన్న కాలనీల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం పకడ్బందీ చర్యలు చేపట్టాం. డీఆర్‌డీఏ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహకారం అందిస్తున్నాం. ప్రభుత్వ నిర్దేశించిన సమయానికే గృహ ప్రవేశాలు చేయించాలని కృషి చేస్తున్నాం.

\- తులసి, పీడీ, డీఆర్‌డీఏ

పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు : ఒకరి అరెస్ట్

రామకుప్పం: పోక్సోయాక్ట్ కింద కేసు నమోదు చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు రామకుప్పం ఎస్‌ఐ తెలిపారు. ఆయన కథనం.. మండలంలోని ఓ బాలికపై పెద్దగెరిగపల్లెకు చెందిన గోవిందప్ప(56) లైంగికదాడికి యత్నించాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో పరారీలో ఉన్న గోవిందప్పను మంగళవారం పల్లికుప్పం క్రాస్‌వద్ద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడికేసులో ఒకరి అరెస్ట్

సోమల: వైఎస్సార్‌సీపీ నేత పీఎల్‌ఆర్ రాజారెడ్డిపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచిన కేసులో పుంగనూరు టీడీపీ మైనారిటీ నేత సుహేల్‌ను మంగళవారం ఉదయం సోమల ఇన్‌చార్జ్ ఎస్‌ఐ మారుతి బెంగళూరులో అరెస్ట్ చేసి సోమల పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. రిమాండ్ నిమిత్తం అతన్ని పుంగనూరు కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

మహిళను నిర్బంధించి లైంగికదాడి

చంద్రగిరి: బ్యాంకులో రుణం ఇప్పిస్తానని చెప్పి తనను నిర్బంధించి నెల రోజులపాటు లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరింది. ఆమె మంగళవారం దళిత సంఘం నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడింది. తాను కుమార్తెతో కలిసి తిరుపతి రూరల్ మండలంలోని ఒక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపింది. వెదురుకుప్పం మండలం బలిజపల్లె దళితవాడకు చెందిన నాగరాజు తరచూ మాట్లాడేవాడని పేర్కొంది. తనకు బ్యాంకులో రుణం ఇప్పించాలని కోరడంతో నవంబర్ 17న బైక్‌లో గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి గదిలో నిర్బంధించాడని తెలిపింది. పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని పేర్కొంది. పాకాల మండలం దామలచెరువులోని బంధువుల ఇంటికి తీసుకెళ్లి అక్కడా లైంగికదాడికి పాల్పడినట్లు వాపోయింది. తనను వదిలిపెట్టకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో స్వగ్రామమైన వెదురుకుప్పం మండలం బలిజపల్లె దళితవాడలో విడిచి వెళ్లాడని తెలిపింది. అవమానాన్ని తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించడంతో గ్రామస్తులు అండగా నిలిచారని వెల్లడించింది. వారి సాయంతో ఈ నెల 6వ తేదీన తిరుపతి ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. ఎస్పీ దిశ పోలీసులకు కేసును బదిలీ చేయగా డీఎస్పీ రామరాజు కేసు దర్యాప్తు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తిరుపతి అంబేడ్కర్ భవన్ చైర్మన్ జయరామ్ మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే దర్యాప్తు చేసి నిందితుడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత నాయకుడు హరి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి



మృతి చెందిన ఇంద్రానమ్మ

సత్యవేడు: మండలంలోని రాజగోపాలపురం గ్రామం వద్ద మంగళవారం తెల్ల వారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. రాజగోపాలపురానికి చెందిన సుబ్రమణ్యంశెట్టి భార్య ఇంద్రానమ్మ(75) మంగళవారం ఉదయం కాలకృత్యాల కోసం పొలాల సమీపానికి వెళ్లి తిరిగి వస్తూ నారాయణస్వామి కాలనీ వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమచారం అందుకున్న ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించారు. క్వారీకి వెళ్లే టిప్పర్లే ఆమెను ఢీకొని ఉంటాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాకెట్ బాల్ క్రీడాకారులకు సత్కారం



రాకెట్ బాల్ క్రీడాకారులను సత్కరిస్తున్న యువత

వెదురుకుప్పం: జాతీయ రాకెట్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడి విజేతగా నిలిచిన మండలానికి చెందిన క్రీడాకారులను ఘనంగా సత్కరించారు. మంగళవారం వెదురుకుప్పంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాకెట్‌బాల్ క్రీడాకారులు ఎస్.హేమాద్రిరెడ్డి, ఎస్.వెంకటేశ్, కే.రాజ, జీ.కుమార్, పురుషోత్తం, రాజు, గజేంద్రరాజుని పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ మాజీ సభ్యులు మోహన్‌మురళీ, యువత సన్మానించారు. మహారాష్ట్రలోని లాతూర్‌లో ఈనెల 6 నుంచి 8 వరకు జాతీయ రాకెట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో 16 రాష్ట్రాలకు చెందిన జట్లు పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడిన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలానికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నేపథ్యంలో యువత పెద్ద ఎత్తున వారిని అభినందించారు. రాకెట్‌బాల్ కోచ్ నాగభూషణం, యువకులు కిరణ్ యాదవ్, కమలాకర్‌రెడ్డి, రవి, అనిల్, తులసి, గాంధీ, ఢిల్లీ, భాస్కర్, దయానందం, మధు, మోహన్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.

భర్త అక్రమసంబంధం శాపమై..

- భార్యను గొంతునులిమి చంపిన భర్త
- ఆపై ఆత్మహత్యగా చిత్రీకరణకు యత్నం
- నక్కలాంపల్లెలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం



మృతురాలు తేజశ్రీ

వెదురుకుప్పం: భర్త అక్రమ సంబంధం భార్యకు శాపంగా మారింది. భార్య, పిల్లలని చూడకుండా వివాహేతర సంబంధమే చాలనుకున్నాడు. తన సంతోషానికి అడ్డుగా ఉన్న భార్యపై కర్కశత్వానికి ఒడిగట్టాడు. రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆమె గొంతు నులిమి చంపేశాడు. ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ, నక్కలాంపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వెదురుకుప్పం ఎస్‌ఐ గోపి కథనం మేరకు.. గ్రామానికి చెందిన శేఖర్, తేజశ్రీ (25) భార్యాభర్తలు. కూలి చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శేఖర్ వివాహేతర సంబంధం కారణంగా ఇంట్లో తరచూ గొడవలు జరిగేవి. భార్య వద్దంటున్నా భర్త వినేవాడు కాదు. దీంతో భార్య తేజశ్రీని అడ్డు తొలగించుకునేందుకు ప్రణాళిక రచించాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న భార్య గొంతు నులిమి చంపేశాడు. తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకుందని నమ్మించే ప్రయత్నం చేశాడు. విషయం తెలుసుకున్న తేజశ్రీ తండ్రి చలపతి సోమవారం వెదురుకుప్పం పోలీసులను ఆశ్రయించాడు. తన కుమార్తెను శేఖర్ కడతేర్చాడంటూ ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. భర్తే చంపేశాడని నిర్ధారించుకున్న పోలీసులు తేజశ్రీ మృతదేహానికి మంగళవారం శవ పరీక్ష నిర్వహించారు. శేఖర్‌పై 302 కింద హత్య కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి మూడేళ్ల వయసుగల కూతురు, మూడు నెలల బాలుడు ఉన్నారు.

హిందీ మార్గదర్శికతో మెరుగైన ఫలితాలు



హిందీ మార్గదర్శిక మెటీరియల్ ఆవిష్కరిస్తున్న డీఈఓ శేఖర్, ఫోరమ్ నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా హిందీ ఫోరమ్ రూపొందించిన హిందీ మార్గదర్శిక మెటీరియల్‌తో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డీఈఓ వి.శేఖర్ తెలిపారు. ఆయన మంగళవారం విశ్వహిందీ దినోత్సవం సందర్భంగా మార్గదర్శిక మెటీరియల్‌ను ఆవిష్కరించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు హిందీపై సరైన అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ మార్కులతోపాటు మంచి స్కోరు, గ్రేడింగ్ సాధించే అవకాశం ఉంటుందన్నారు. ఫోరం అధ్యక్షుడు హరిబాబు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేందుకు పలువురు విషయ నిపుణులతో కలిసి మెటీరియల్‌ను రూపొందించామని తెలిపారు. వీటిని త్వరలో పీడీఎఫ్ రూపంలో హిందీ భాషోపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు అందజేస్తామన్నారు. హిందీ ఫోరం తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షులు జయకర్, ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి షాజహాన్, కార్యదర్శులు దాము, రమేష్‌యాదవ్, మహిళా కార్యదర్శి మల్లీశ్వరి పాల్గొన్నారు.

200 బస్తాల తమిళ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న తమిళనాడు రేషన్ బియ్యం

సూళ్లూరుపేట : రైళ్లలో అక్రమంగా తరలిస్తున్న 200 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని సూళ్లూరుపేట రైల్వే పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కొంతమంది తమిళనాడులోని పలు ప్రాంతాల్లో సేకరించిన బియ్యాన్ని చెన్నై–సూళ్లూరుపేట మధ్య తిరుగుతున్న సబర్బన్ రైళ్లలో తరలిస్తున్నట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. మంగళవారం ఆకస్మికంగా దాడులు చేసి 200 బస్తాలు సీజ్ చేశారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



రోగులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మంగళం పీహెచ్‌సీ డాక్టర్లు స్రవంతి, జయంతి

తిరుపతి మంగళం : క్షయవ్యాధితో బాధపడుతున్న రోగులు సరైన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని మంగళం పీహెచ్‌సీ డాక్టర్ స్రవంతి తెలిపారు. పీహెచ్‌సీలో మంగళవారం 15 మంది క్షయవ్యాధిగ్రస్తులకు డాక్టర్లు స్రవంతి, జయంతి పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న 15 మంది పేషంట్లను నిక్షయమిత్ర ద్వారా మంగళం పీహెచ్‌సీ నుంచి తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. వారికి ప్రతి నెలా ప్రభుత్వం అందించే మందులతో పాటు మెరుగైన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అలాగే వారు మరింత ఆరోగ్యంగా ఉండేందుకు పప్పు దినుసులతో పాటు ఇతర వస్తువులను అందజేసినట్టు పేర్కొన్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి



అశోక్ మృతదేహం, అశోక్ (ఫైల్)

నగరి : పట్టణంలోని శాంతి థియేటర్ సమీపంలో శనివారం బైక్ ఢీకొనడంతో యవకుడు మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. నగరి దళితవాడకు చెందిన అశోక్ (28) ఏకాంబరకుప్పానికి బైక్‌లో వెళుతున్నాడు. మూతపడిన శాంతి థియేటర్ సమీపంలో మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. అశోక్ ఎగిరి కింద పడ్డాడు. అదే సమయంలో వేగంగా వస్తున్న ప్రైవేటు బస్సుకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రైల్వే కాంట్రాక్టు పనుల్లో కూలీగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అమ్మవారి విగ్రహం లభ్యం



అటవీప్రాంతంలో బయటపడిన అమ్మవారి విగ్రహం

సూళ్లూరుపేట: శ్రీహరికోట రాకెట్ కేంద్రం అటవీ ప్రాంతంలో మంగళవారం అమ్మవారి విగ్రహం లభ్యమైంది. ఎప్పటి లాగే చల్లా యానాదులు కొంతమంది షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదిక, టెలీమీటర్ రోడ్డుకు సమీపంలో కట్టెల కోసం వెళ్లారు. అక్కడ అమ్మవారి రూపంలో పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్న విగ్రహం కంటపడింది. వారు వెంటనే రెండో ప్రయోగవేదికకు సమీపంలో ఉన్న వ్యాస్ట్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ వెంకట్రామన్ బృందానికి తెలియజేశారు. వారు అటవీ ప్రాంతంలోకి వెళ్లి విగ్రహాన్ని పరిశీలించారు. శూలం ధరించిన అమ్మవారు శక్తి స్వరూపిణి ఆసనంలో కూర్చుని ఉండడం గమనించి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడే అమ్మవారికి చిన్నపాటి ఆలయాన్ని నిర్మించి అమ్మవారిని ప్రతిష్టిస్తామని వారు పేర్కొన్నారు. ఇదిలా వుండగా శ్రీహరికోట దీవి ప్రాంతం అటు బంగాళాఖాతానికి, ఇటు పులికాట్ సరస్సుకు మధ్యలో విస్తరించి ఉంది. శ్రీహరికోట దీవి అరకోటి లింగాలతో నిండిన కోటగా శ్రీహరకోటగా ఉండేదని, కాలక్రమేణా ఇది శ్రీహరికోటగా మారిందని చెబుతుంటారు. స్థానికంగా చోళరాజులు నిర్మించిన ఆలయాలు ఎన్నో ఉన్నాయని, నాడు ఇక్కడ ఉన్న ఆలయాల్లో ఈ అమ్మవారి ఆలయం కూడా ఒకటై ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.